## క్లుప్తంగా

### విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు పరీక్షలు ధైర్యంగా రాయాలని ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మార్చి 1న నిర్వహించే 10వ తరగతి టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాడటమే కాకుండా విద్యార్థుల్లో ఉన్నటువంటి ప్రతిభను గుర్తించడం కోసం ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇలాంటి పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించే అవకాశం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్‌ను పదో తరగతి విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్, జిల్లా సహాయ కార్యదర్శి కర్రోల్ల నవీన్, నాయకులు రోహిత్, రాఘవ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్లారెడ్డి

దుబ్బాకటౌన్: బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దుబ్బాక పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండెల్లి ఎల్లారెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఎల్లారెడ్డికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డితో కలిసి నియామకపత్రం అందించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి అహర్నిషలు పాటుపడతానన్నారు. నమ్మకంతో ఈ పదవిని ఇవ్వడంపై ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిని మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు ఘనంగా సన్మానించారు.

### పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఐఏఎస్ అధికారి వెంకట్ నర్సింహారెడ్డి తల్లి జానాబాయి ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జగదేవ్‌పూర్‌లోని వెంకట్ నర్సింహారెడ్డి గృహంలో జానాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్ నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### గోదావరి జలాలతో చెరువులు నింపాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయకసాగర్ నుంచి కాల్వలు తవ్వి గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని చంద్లాపూర్ శివారులోని కాళేశ్వరం ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు మాట్లాడుతూ.. చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేసేలా కాల్వలు లేకపోవడంతో ప్రాజెక్టులు ఉన్నా ఫలితం లేదన్నారు. రంగనాయకసాగర్, అన్నపూర్ణ ప్రాజెక్టులు పూర్తయి ఐదేళ్లు గడుస్తున్నా కాల్వలు తవ్వకపోవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదన్నారు. నీరు లేక రైతులు వేసిన పంటలు ఎండుతున్నాయన్నారు. వెంటనే కాల్వలు తవ్వి చెరువులు, కుంటలు నింపాలన్నారు. ధర్నాలో నాయకులు మహేందర్, జయంత్, గణేష్, పరశురాములు, రాజు, మహేందర్, వేణు పాల్గొన్నారు.

### ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని వాగుల్లో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు దూల్మిట్ట తహసీల్దార్ గోపాల్ అన్నారు. శనివారం బెక్కల్, భైరాన్‌పల్లి, జాలపల్లి గ్రామాల్లో ఇసుక సంరక్షణపై గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ అవసరాలకు, ప్రభుత్వ పనులకు ఇసుకను వినియోగించుటకు అంగీకరించాలన్నారు. గ్రామాల్లో కొంతమంది ట్రాక్టర్ యజమానులు అనుమతులు లేకుండా ఇసుకను అమ్ముతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కోర్టులో సరెండర్ చేయడం లేదా మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించనున్నట్లు హెచ్చరించారు. అదేవిధంగా రూ.50వేల జరిమాన విధించనున్నట్లు తెలిపారు. గ్రామసభలో తీర్మానం చేసిన ట్రాక్టర్ నంబర్‌తో సహా ట్రిప్పులు ప్రతిరోజు సాయంత్రం సర్పంచ్, తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. తీర్మానంలో లేని ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తే వెంటనే సీజ్ చేయనున్నట్లు తెలిపారు.

# మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

**ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు**




ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే తదితరులు

హుస్నాబాద్‌రూరల్: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం మీర్జాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. గిరిజన తండాలు గల మీర్జాపూర్‌లో ఆస్పత్రి ఏర్పాటు చేస్తే గిరిజనులు, పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. నిత్యం ఇక్కడే వైద్యులు ఉండి 57 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తారని చెప్పారు. ఆస్పత్రి భవనాల నిర్మాణానికి రూ.2కోట్ల నిధులను కూడా మంజూరు చేశామని, ఆరు నెలల్లో కొత్త భవనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. పేదల ఆరోగ్యం కోసమే వైద్య సేవలను విస్తరిస్తున్నామని, హుస్నాబాద్ ఆస్పత్రి స్థాయిని పెంచడంతో పాటు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మీర్జాపూర్‌కు తేవడానికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పట్టుదల ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, గ్రామీణులందరూ వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. మీర్జాపూర్ నుంచి జిల్లెలగడ్డ వరకు బీటీరోడ్డు, మీర్జాపూర్ ముదిరాజ్‌లకు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, సర్పంచ్‌లు తరాల లత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధే ధ్యేయం**

కోహెడ(హుస్నాబాద్): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం కోహెడలో రూ.1.30కోట్లతో నిర్మించిన జీపీ కాంప్లెక్స్, రూ.20లక్షలతో పల్లె ప్రకృతి వనాన్ని ప్రారంభించారు. రూ.30లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో గ్రామాలు సుందరంగా తీర్చిదిద్దబడ్డాయన్నారు. కోహెడకు నాలుగు ఏళ్లలో రూ.11కోట్లు 20లక్షల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఎంపీటీసీకి రూ.10లక్షలు త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. మహిళా సంఘాలకు మార్చి నెలలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. రైతులు అయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని కోరారు. సిద్దిపేటలో రూ.300కోట్లతో ఫ్యాక్టరీని నిర్మిస్తున్నట్లు చెప్పారు. సిద్దిపేట జిల్లాలో 8 వేల ఎకరాల్లో సాగు అయిందన్నారు. కోహెడకు 108 వాహనం నెలలోపు ఏర్పాటు చేస్తామన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. తల్లి, బిడ్డ మరణాలు అరికట్టేందుకు రానున్న ఉగాదికి కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ ప్రారంభం కానుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, రాష్ట్ర నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కర్ర శ్రీహరి, డాక్టర్ పి.రవీందర్‌రావు, కోహెడ ఫ్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు, ఎంపీపీ కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ శ్యామల, సర్పంచ్ పేర్యాల నవ్య తహసీల్దార్ జావిద్ అహ్మద్, ఎంపీడీఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి తలంబ్రాల దీక్షలో భాగస్వాములవడం అదృష్టం

**ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



కోటి తలంబ్రాల దీక్షలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, తదితరులు

గజ్వేల్‌రూరల్: భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే తలంబ్రాలను సిద్ధం చేసే అవకాశం రావడం మన అదృష్టమని, కోటి తలంబ్రాల దీక్షలో గజ్వేల్ ప్రాంత భక్తులు భాగస్వాములమవుతున్నందుకు సంతోషంగా ఉందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. శనివారం భద్రాచలం నుంచి వచ్చిన వడ్లను రామనామ స్మరణ చేస్తూ గోటితో వలచి తలంబ్రాల తయారీ కోసం సిద్ధం చేసే అదృష్టం ఈ ప్రాంత భక్తులకు దక్కడం గర్వంగా ఉందన్నారు. గజ్వేల్ ప్రాంత భక్తులతో 100 కోట్ల రామనామాలను లిఖింపజేయడంలో రామరాజు కృషి ఎనలేనిదన్నారు. సామాజిక సమరసతా వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు మాట్లాడుతూ.. కోటి తలంబ్రాల దీక్షతో ఈ ప్రాంతానికి ఆధ్యాత్మికంగా గుర్తింపు తెస్తున్న రామకోటి రామరాజుకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్ రహీం, నాయకులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని 33కేవీ, 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుస్సాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ మహేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### సులభతర పద్ధతిలో బోధన బేష్



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

సిద్దిపేటజోన్: విద్యార్థుల అభిరుచి, ఆసక్తి, అర్థం అయ్యే రీతిలో సులభతరమైన పద్ధతిలో బోధన చాలా మంచిదని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం విపంచి ఆడిటోరియంలో వికాస్ హైస్కూల్ గ్రాడ్యుయేషన్ డే సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అబ్బురపరిచిన విద్యార్థుల విన్యాసాలు



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో చార్వాక మోడల్ స్కూల్ విద్యార్థులు శనివారం నిర్వహించిన యోగా, సెల్ఫ్ డిఫెన్స్ కరాటే విన్యాసాలు అబ్బురపరిచాయి. యోగా, కరాటే విన్యాసాలతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగాతో ఆరోగ్యం, ఆత్మరక్షణ కోసం కరాటేతో చేకూరే ఉపయోగంపై విద్యార్థులు విన్యాసాలతో గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో చార్వక ప్రిన్సిపాల్ ధర్మారం కుమార్, ఉపాధ్యాయ బృందం కృష్ణ, విశాల్, మౌనిక, శ్యామ్, వాణి, శ్రీలత, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

**రాష్ట్ర బీసీ గురుకుల కార్యదర్శి మల్లయ్య బట్టు**



మాట్లాడుతున్న మల్లయ్య బట్టు

దుబ్బాక: విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల కార్యదర్శి మల్లయ్య బట్టు అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం లింగరాజ్‌పల్లి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్వహించిన సిల్వర్ జూబ్లీ ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యే శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తదితరులున్నారు.

### పాత పద్ధతిలో పన్నులు వసూలు చేయాలి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో పాత పద్ధతిలోనే ఇంటి పన్నులు వసూలు చేయాలని జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో జేఏసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్చి 6న మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జేఏసీ కో–చైర్మన్ పుర్మ ఆగం రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, టీడీపీ అధికార ప్రతినిధి ఒగ్గురాజు, ఎంఎస్పీ డివిజన్ ఇన్‌చార్జి సనవాల ప్రసాద్, ఇంటి పన్నుల భాదిత సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి భిక్షపతి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, సీపీఎం జిల్లా నాయకులు, మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, మంచాల చిరంజీవులు, ఉప్పల నాగరాజు, బండి సుదర్శన్, బాల్‌నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి పాలనను తరిమికొట్టాలి

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భూమేశ్‌గౌడ్**



మాట్లాడుతున్న పరశురాములు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి పాలనను తరిమికొట్టేందుకు వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భూమేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు పిట్ల పరశురాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని గోనెపల్లి, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపడుతూ సీఎం గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. అన్ని వర్గాలను ఆదుకుంటున్నామని చెబుతున్నా.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు ప్రజాగోస–బీజేపీ భరోసా యాత్ర పేరుతో కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను అన్ని రంగాల్లో మోసం చేసి దోచుకుంటుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రాజిరెడ్డి, ఆకుల శ్రీనివాస్, కనకయ్య, రమేశ్, శివరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **మైనార్టీలకు బ్యాంక్ రుణాలు అందించాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మైనార్టీల అభివృద్ధికి బ్యాంక్ రుణాలు వెంటనే అందించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇమామ్ మాట్లాడుతూ.. ఇటీవల మైనార్టీలకు స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ప్రకటించారని, దీంతో పెద్ద ఎత్తున ముస్లింలు దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా కనీసం పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. తంజీమ్ సొసైటీ సభ్యులు వెంటనే మైనార్టీ రుణాలపై స్పందించాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు గయాజుద్దీన్, హస్రుద్దిన్, ప్రేమ్‌కుమార్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

◆ **కంటి వెలుగు దేశానికే ఆదర్శం**

ములుగు(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటివెలుగు పథకం దేశానికే ఆదర్శమని ములుగు మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని తున్కిబొల్లారంలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రజలు కంటిచూపు సమస్యతో ఇబ్బంది పడకూడదని సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. సీఎం నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

◆ **అల్పాహారం ప్రారంభం**

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ అందించే రాగి జావ అల్పాహార కార్యక్రమాన్ని సర్పంచ్ కృష్ణవేణి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రాజు, ఉపసర్పంచ్ మాధవి, రమాదేవి, హెచ్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ **అసంపూర్తి పనులు పూర్తి చేయాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరుతూ మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె ఉపసర్పంచ్ సర్మోట మానస శనివారం మండల పరిధిలోని చిట్టాపూర్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోతెలోని దళిత వాడలో సీసీ రోడ్డుతో పాటు బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తిగా అసంపూర్తిగా ఉన్నాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంజిత్, చంద్రం, భూపాల్, మహేశ్, ప్రభాకర్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి**

హుస్నాబాద్: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తే ఎంసెట్, ఐఏఎస్ ర్యాంకులు సాధించవచ్చని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సినిమా టికెట్‌పై 50 శాతం తగ్గింపుతో సార్ అనే సినిమాను చూపించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు సరైన వసతులు లేకున్నా, చదువు, నాణ్యత విషయంలో లెక్చరర్లు ఎంతో కష్టపడి ర్యాంకులు వచ్చేలా కృషి చేయడం ఈ చిత్రంలో కళ్లకు కట్టినట్లుగా చూపించారన్నారు.

# దుబ్బాక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- 29 ఎజెండా అంశాలు ఆమోదం



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: మున్సిపాలిటీ అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారిస్తూ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం చైర్‌పర్సన్ వనితభూంరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దుబ్బాక అభివృద్ధికి ఇప్పటికే మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తాను ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. అందరం కలిసికట్టుగా ఉండి రాష్ట్రంలోనే దుబ్బాకను అన్ని రంగాల్లో అగ్రగామిగా తయారు చేసుకుందామన్నారు.

**కౌన్సిల్‌లో 29 ఎజెండా అంశాలు ఆమోదం**

దుబ్బాక మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 29 ఎజెండా అంశాలను ఆమోదించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో రోడ్ల పక్కన డస్ట్‌బిన్స్ ఏర్పాటుకు రూ.5లక్షలు కేటాయించారు. పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దుకాణ సముదాయాల్లో 1, 12, 13 షెటర్లకు లీజ్ డీడ్ అగ్రిమెంట్‌కు ఆమోదం తెలిపారు. 20 వార్డుల్లోని 50 స్థలాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై వాల్ పెయింటింగ్‌కు రూ.2లక్షలు, నీటిసరఫరా విభాగంలో ట్యాంకులు శుభ్రపర్చడం, రోడ్ల పక్కన బ్లీచింగ్ చల్లుటకు రూ.2.70లక్షలు, మోటార్ల రిపేర్‌కు 4.91లక్షలు, దుంపలపల్లిలో ఫ్రీడం పార్క్ ఏర్పాటుకు రూ.5.50లక్షలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు నిధుల మంజూరును ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ బాలకిషన్‌గౌడ్, కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

### అభివృద్ధి పనులకు భూమిపూజ

దుబ్బాకరూరల్: మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో వంజరి, గౌడ సంఘం, సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం బల్వంతాపూర్‌లో కాల్వ పనులు పరిశీలించారు. అనంతం ఎంపీ మాట్లాడుతూ.. యాసంగిలో వరి పంటలు ఎండిపోకుండా పంటల సాగు కోసం మల్లన్న సాగర్ కాల్వల ద్వారా నీళ్లు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కైలాష్, వెంకటయ్య, సతీశ్ రెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గజ్వేల్‌రూరల్: ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలను ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. రోడ్డు మధ్యలో వాహనాలను నిలపడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారముందని, ఆటోల్లో సౌండ్ స్పీకర్లను వాడొద్దని, ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించాలన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, డ్రైవర్ పక్కన ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. రాత్రి సమయాల్లో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే పోలీసులకు లేదా 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ సీఐ వీరప్రసాద్, ట్రాఫిక్ సీఐ తిరుపతి, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ బాధ్యులు

సిద్దిపేటఎడ్యుకేషన్: కాకతీయ యూనివర్సిటీ వైద్య కళాశాల విద్యార్థిని ప్రీతికి న్యాయం చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ప్రీతికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తాలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో షీటీమ్‌లు పేరుకు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థినిలు, మహిళల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. సీనియర్ల వేధింపుల మూలంగా ప్రీతి ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్న ఘటన మూడు రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం సిగ్గు చేటని విమర్శించారు. గిరిజన బిడ్డకు న్యాయం జరిగే వరకు ఏబీవీపీ అండగా నిలిచి పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పవన్, బాధ్యులు సంజయ్, శంకర్, లితిన్, కార్తిక్, అభి, హేమంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): పీజీ వైద్య విద్యార్థిని ప్రీతిని వేధించిన సైఫ్‌ను వెంటనే ఉరి తీయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు నూనావత్ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. కొంత కాలంగా ప్రీతిని సైఫ్ వేధిస్తున్నాడని, ఇదే విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆ యువతి మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. వెంటనే ఏసీపీ కిషన్, కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గిరిజన లోకం ఏకతాటిపైకి వచ్చి ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని హెచ్చరించారు.

సిద్దిపేటకమాన్: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ వైద్య విద్యను చదువుతున్న ప్రీతి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణారెడ్డి అన్నారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద శనివారం వారు మాట్లాడుతూ.. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు పద్మ, లక్ష్మి, విజయ పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంఈఓ యాదవరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని సిద్దిపేట మండల విద్యాధికారి యాదవరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. అందువలన తమకు వచ్చిన ఆలోచనలను ఆవిష్కరణల దిశగా తీసుకుపోవాలన్నారు. చిన్నారులు సైన్స్ ఎగ్జిబిట్‌లను తయారుచేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఫాతిమాబేగం, హర్షద్, జ్యోతి సెల్వరాజ్, రేచల్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామానికి గడ్డం రాజు చికిత్స కోసం రూ.2.5లక్షల ఎల్‌ఓసీని కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు ఆహ్మద్, కిష్టారెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులకు అభినందన సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 17న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ కరాటే పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులను ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అభినందించారు. క్రీడారంగాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. క్రీడాకారులకు అండగా ఉంటామన్నారు.

**పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి వరం**

మర్కూక్(గజ్వేల్): పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి పథకం ఓ వరంలా మారిందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ములుగు(గజ్వేల్): కల్యాణలక్ష్మి పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ములుగు ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని సింగన్నగూడ గ్రామంలో సర్పంచ్ బాలకృష్ణ, ఉపసర్పంచ్ స్వామిగౌడ్‌లతో కలసి ముగ్గురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యుడు అన్వేశ్, బీఆర్ఎస్ నాయకులు నరేశ్‌గౌడ్, నవీన్ పాల్గొన్నారు.